

# టీ.వీ.రిపేరు కొచ్చింది.

"సార్ ! అయ్యగారు మిమ్మల్ని పిలుస్తున్నారు" ప్యూన్ భాషా చెప్పాడు.

ఫైలు ముందేసుకుని సీట్లో కునుకుపాట్లు పడుతున్న సుబ్బారావు ఉలిక్కిపడ్డాడు. భుజంగం మేనేజరు మహాగట్టిపిండం. మూడ్‌లో ఉంటే బాగా మాట్లాడుతాడు లేదా ఎదుట వ్యక్తి ఎవరైనా కానీ చడామడా తిట్టేస్తాడు.

గుండెలు అరచేత్తో పట్టుకొని ఛాంబరులోకి వెళ్ళాడు. "ఏమోయ్! ఆ ట్రయల్ బ్యాలెన్స్ ట్యాలీ అయిందా-ఇప్పుడే హెడ్డాఫీసునుండి ఫోన్ వచ్చింది".

" లేదు సార్ !" నాన్చాడు.

" వ్వాట్! ఇంకా కాలేదా? ఇవ్వాళ తేదీ ఎంత? మొన్ననే మనం పంపించాల్సి ఉంది. ఇంత లేటా?" గయ్‌మని లేచాడు.

" సారీ సార్ ! ట్యాలీ కావడం లేదు - అందుకే ..."

" నోనో ! నిన్న ఇదే మాటన్నావు. ట్యాలీ అయ్యేదాకా ఆఫీసులో ఉండి పూర్తి చెయ్యమన్నాను. ఇంట్లో చేస్తానని తీసుకుపోతానన్నావు. ఏమైంది?" కొరకొర చూస్తూ అడిగాడు.

సుబ్బారావు గతుక్కు మన్నాడు. నిజంగానే ఇంట్లో చేసి తెద్దామని తీసుకువెళ్ళాడు. తీరా ఇంటికెళ్ళేసరికి కేబుల్లో మంచి సినిమాలు వేశారు. ముందు స్టార్ మూవీస్‌లో మంచి హారర్ సినిమా- ఈ టీవీలో తర్వాత మంచి సెంటుమెంటు సినిమా, ఆ తరువాత జెమినీలో సస్పెన్స్ సినిమా- వెరసి రాత్రి ఒంటిగంట దాటింది. కానీ ఒక్క అక్షరం ముక్క ముందుకు పోలేదు పెన్ను. పేరుకు ట్రయిల్ బ్యాలెన్స్ ముందేసుకుని కూర్చున్నా మనస్సంతా టీవీమీదే ఉంది. కాబట్టి పనిచేయలేకపోయాడు.

"ట్రై చేశాను సార్... కాని - అది ట్యాలీ కాలేదు. ఇప్పుడు చూస్తాను సార్!" చెప్పాడు.

" ఇదే లాస్ట్ వార్నింగ్-ఐకాంట్ టాలరేట్- మీ మూలంగా పైన నాకున్న ఇమేజ్ అంతా పోతున్నది. ఎంత రాత్రయినా సరే ఆఫీసులో ఉండి ట్రయల్ బాలెన్స్ ట్యాలీ చేసి - కొరియర్‌లో పంపించి ఇంటికెళ్ళు!" ఆజ్ఞ జారీ చేశాడు.

" ఒకవేళ రాత్రికి కూడా కాకపోతే... " నాలుక జారాడు.

" హు ! తెల్లవార్లు మేలుకుని పూర్తిచేసి... నువ్వన్నా బస్సులోపోయి హెడ్డాఫీసులో

ఇచ్చిరా– లేకపోతే భాషాకన్నా ఇచ్చిపంపు. సంతకాలు కావాలంటే ముందే తీసేసుకో" విసుగ్గా చెప్పాడు.

'అమ్మయ్య ! బ్రతికాను' అనుకుంటూ వచ్చి సీట్లో కూలబడ్డాడు. కొన్ని జతల కళ్ళు అతన్ని గమనిస్తున్నాయి. మొహానికి పట్టిన చెమట తుడుచుకోవడం నిట్టూర్పులు విడవడం వగైరాలు.

'ఛీ !ఛీ వెదవ బ్రతుకు' అనుకుంటూ మళ్ళీ ట్రయల్ బ్యాలెన్సు ముందేసుకున్నాడు. కాని మత్తుగా ఉంది. ఆ సినిమాలు చూడ్డంతో రాత్రి సరిగా నిద్రపట్టలేదు. నిద్రముంచుకొస్తున్నది. బాత్‌రూమ్‌కెళ్ళి మొహం కడుక్కుని కూర్చున్నాడు.

అట్లానే కునికిపాట్లు పడుతూ – ఎలాగైతేనేం.. సాయంత్రం ఏడుకల్లా ట్రయల్ బాలెన్సు తయారు చేసి కొరియర్‌లో పంపించేశాడు.

కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొచ్చేసరికి శ్రీమతి చిర్రుబుర్రులాడుతున్నది.

" ఇప్పుడా రావడం? ఇల్లు గుర్తుండదా? "

" ఏమైంది... ఆఫీసులో పని ఉండి లేటయింది" సంజాయిషీ ఇచ్చాడు.

" మామూలేగా మీకు ... మీ ఆఫీసు, మీ సుఖం తప్పించి ఇల్లు ఎప్పుడు పట్టింది కనుక" రాగాలు తీసింది కాత్యాయని.

" ఇప్పుడేం కొంపలంటుకున్నాయి? కార్గిల్ యుద్ధం యిటేమన్నా వచ్చిందా?" కోపంగా అన్నాడు.

" ఆ ! అంతా అయింది... టీవీ పాడైపోయింది" మూతి విరిచింది.

సుబ్బారావు గుండె గుభేలుమంది. పదిహేను వేలు పోసి కలర్‌టీ.వీ కొని సంవత్సరం గూడా కాలేదు. అప్పుడే పాడైపోయిందట!

ఆత్రంగా లోపలికి వచ్చి ప్లగ్‌లో వైరు పెట్టి స్విచ్ ఆన్ చేసి అది ఇది నొక్కి చూశాడు... ఎంత ప్రయత్నించినా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంది కానీ ఒక్కమాట పలుకు– దృశ్యం లేదు.

" అయ్యో ! అయ్యో ! ఏమైందే? బుజ్జిగాడు ఏమన్నా చేశాడా?"

" లేదండి... సినిమా చూస్తుంటే ఉన్నట్లుండి ఆగిపోయింది."

" స్ట్రైకా !" ఆశ్చర్యంగా అడిగాడు.

" ఆ ! మరీ... ముందు మెకానిక్‌ను పట్టుకురండి" హుకుం జారీ అయింది.

సుబ్బారావు ఆఘమేఘాల మీద షాపుకెళ్ళి చెప్పి– మెకానిక్కుని ఇంటికి రమ్మని పిలిచాడు 'లేదు సార్! సెట్టును ఇక్కడికి తీసుకురండి– నేను చాలా బిజీ" అన్నాడు.

కుయ్యోమొర్రో అనుకుంటూ – ఇంటికొచ్చి రిక్షా వేసుకుని టీవీని షాపుకు తీసుకెళ్ళాడు.

అప్పటికి తొమ్మిదయింది.

" ఇంత లేటుగా వస్తే ఎలా సార్ ! రేపురండి" చెప్పాడు వాడు.

" బాబూ! టీవీ ప్రాణులం! టీవీ లేకుండా ఒక్కగంట కూడా ఉండలేం. ఇంట్లో మూడో ప్రపంచ యుద్ధం మొదలవుతుంది. ఎలాగో చూసి బాగుచెయ్యి. నీ శ్రమ ఉంచుకోను" చెప్పాడు.

వాడు దేశాన్ని ఉద్ధరించేంత వీరఫోజుపెట్టి సెట్ ఓపెన్ చేసి అటూ ఇటూ కెలికాడు. ఓ పది నిమిషాలు కుస్తీ పట్టాడు.

" లాభం లేదు సార్ ! డీటెయిల్డ్‌గా చూడాలి. ఏదో మేజరు డెఫెక్టులాగుంది. రేపు సాయంత్రానికి రండి రెడీ చేస్తాను" ఇంక బయటకు నడవమన్నట్లు లేచాడు.

చేసేదేం లేక సుబ్బారావు కాళ్ళీడ్చుకుంటూ ఇల్లుచేరాడు.

ఆరాత్రి భారంగా గడిచిపోయింది. ఏ ఛానెల్‌లో ఏ సినిమా వస్తుందో తల్చుకుంటూ- అది ఎంత బాగుంటుందో ఊహించుకుంటూ నిద్రపోయారు.

కమ్మగా నిద్రపట్టింది... ఉదయం హుషారుగా లేచాడు.

" ఏంటండి ఇవ్వాళ చాలా హుషారుగా ఉన్నారు?" టైపిస్టు అరుంధతి అడిగింది.

" ఉషారా పాడా? మా టీవి చెడిపోయి ఏడుస్తుంటేనూ..." కాని మళ్ళీ అదేమాట భుజంగం నోటినుంచి వచ్చింది.

" సుబ్బారావు ! నువ్వు మంచి వర్కర్‌వోయ్! హెడ్డాఫీసు వాళ్ళు ఫోన్ చేశారు. ట్రయిల్ బాలెన్స్ అందిందట. మేనేజరు చాలా సంతోషపడ్డాడు. ఇవ్వాళున్నట్లు ఉషారుగా రోజూ వుంటే  ఇలా వర్క్ పెండింగ్ పడదు కదా!"

ఇంటికి రాగానే కాత్యాయని ఎదురురాలేదు. వాకబు చేస్తే టీవీ చూడ్డానికి పక్కింటి కెళ్ళిందని తెల్సింది బుజ్జిగాడిని తీసుకుని. మొహం కడుక్కుని ఫ్లాస్కు లోని కాఫీ తాగే సరికి వచ్చేసింది.

" ఆ అనసూయకి ఎంత పొగరండి... తనకే కలర్ టీవీ ఉందని మనమేదో గతిలేక చూడ్డానికి వచ్చామనుకుంటుంది "

" ఏమంది?"

" మన టీవీ ఎలాగూ లేదు కదాని... మధ్యాహ్నం ఈ టీవీలో సినిమా చూద్దామని వెళ్ళాను. ఏదీ ఒక్క సినిమా చూడనివ్వలేదు. రిమోటు ఉంది కదాని మోటుగా ఛానెల్స్ మార్చేస్తున్నది. ఏం ఆ సినిమాలు చూడకపోతే ఛస్తామా... అయినా అన్నీ చూసినవే కదా! ఇంక దానింటికి వెళ్ళను" కాత్యాయని డిక్లేర్ చేసింది.

మళ్ళీ మెకానిక్ దగ్గరికి వెళ్ళమని తరిమింది.

" సారీ సార్ ! ఫలానాది కాలిపోయింది. అది కంపెనీలోనే దొరుకుతుంది... వారంటీ పీరియడ్‌లో ఉంది కాబట్టి మీ టీవీని కంపెనీకి పంపిస్తాం. వాళ్ళే రిపేరు చేసి పంపిస్తారు" చావు కబురు చల్లగా చెప్పాడు మెకానిక్కు. సుబ్బారావు ఎన్ని క్రాసుక్వశ్చన్లు వేసినా లాభం లేకపోయింది.

కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి వచ్చాడు.

టీవీ వస్తుందని ఎదురుచూసిన కాత్యాయని భోరుమంది. "టైమెలా గడుస్తుందండి!" కన్నీళ్ళు పెట్టుకుంది.

సుబ్బారావు ఆమెని ఓదార్చి షికారుకని చెప్పి సాయిబాబా గుడికి తీసుకెళ్ళాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ భారంగా ఇప్పుడిప్పుడే టీవీ లేని తనానికి అలవాటు పడుతున్నారు. ఆ టైమును వేరే పనులకు మళ్ళించారు. సుబ్బారావైతే ఆఫీస్ వర్క్ పెండింగ్ వుంటే తెచ్చి చేసుకుంటున్నాడు. ఠంచనుగా రాత్రి పదకొండు కల్లా నిద్ర పోగల్గుతున్నాడు. ఆఫీసులో కునికిపాట్లు తగ్గాయి. కళ్ళు మంటలు కూడా రావడం లేదు.

బుజ్జిగాడు కూడా హోమ్‌వర్క్ బాగా చేసుకుంటున్నాడు.

పక్కింటి పిన్నిగారు కాని, స్నేహితురాళ్ళు గాని వచ్చి ఫలానా సినిమా ఫలానా ఛానెల్‌లో వస్తున్నది రమ్మని పిలిస్తే – "ఓహో ! ఆ సినిమానా? నేను దాన్ని ఎప్పుడో చూశాను. నాకు కథంతా గుర్తుంది. ఇంక కొత్తగా చూసేదేముంది?" అని చెప్పివేసే స్థాయికి ఎదిగింది కాత్యాయని.

ఈవెనింగ్ వాక్‌లా అలా జంటగా కాని సింగిల్‌గా కాని మెకానిక్ దగ్గరికి వెళ్ళడం తన టీవీ ఏమైందనీ అడగడం చేస్తూ వుంటాడు సుబ్బారావు.

అలా చేయడంతో కొండొకచో మెకానిక్ విసుక్కుంటాడు. జాలిపడతాడు నవ్వుతాడు.

కాని సుబ్బారావుకు నడకలోని సుఖం – సాయంత్రాలు చల్లగా బజారులో తిరగడంలోని మజా తెలిసివచ్చాయి.

కేబుల్ టీవీలో లీనమైపోయిన వాళ్ళకు బాహ్య ప్రపంచంలోని అందాలు తెలిసాయి. ఎన్నాళ్ళగానో పెండింగ్‌లో పెట్టిన పనులు భార్యా భర్తలు చక చక చేసుకో గల్గుతున్నారు.

ముఖ్యంగా దాంపత్యం బాగుంది. అప్పుడు అర్ధరాత్రులు మేల్కొని నిద్రపోగొట్టుకుని – సుఖం కోసం మొహం వాచిపోయిన వాళ్ళకు వేళకు మంచం మీదకు చేరడంలోని ఆనందం తెల్సివచ్చింది.

ఓ రోజు మెకానిక్ చెప్పాడు.

" సార్ కంపెనీ నుంచి కబురొచ్చింది – మీ టీవిని లారీలో పంపిస్తున్నారట!"

" అయ్యో ! బాధపడ్డాడు సుబ్బారావు.

విచిత్రంగా చూశాడు మెకానిక్.


DENTIST
AVM


ఈ గోపీ ఎవడో అనుకోకండి డాడీ!
కృష్ణగాడు నా బాయ్ ఫ్రెండ్! ఇతన్ని
స్పేరుగా వుంచా!!
RTC DRIVER
AVM


నీకు లక్ష బాకీ వున్నాం నిజమే!
ఇంకో రెండులక్షలు అప్పిచ్చెయ్!
నీ బాకీ లక్ష చెల్లు రాసుకో!!

" ఆ ! నిజం ! టీవీ వలన నేను ఏం పోగొట్టుకున్నానో నాకర్థమయింది. ఉదయం నిద్ర లేచినప్పటినుండి పడుకొనే దాకా మన టైం మన చేతిలో ఉండేది కాదు. కేబుల్ వాడి కీలుబొమ్మనయిపోయాను. కాని ఇప్పుడు నా టైమును నేను ప్లాన్ చేసుకుని ఆనందంగా ఉన్నాను. నాకు కావలసినంతకాలం కల్సివచ్చింది" సుబ్బారావుకు జ్ఞానోదయమై చెప్పాడు.

" మన టీవి రిపేరయి రేపు వస్తున్నదట!" సుబ్బారావు చెప్పాడు ఎదురొచ్చిన కాత్యాయనికి.

అతను ఆశించినట్లు ఆమె సంతోషించలేదు. మూతి విరిచింది.

"అయ్యో ! రెండు నెలలకే రిపేరయిందా?"

" అదేంటే - టీవీ లేదని నువ్వేగా అంటున్నది. నీ బాధ పడలేక కదా అంత డబ్బు తగలేసింది."

" నిజమే కాని - కేబుల్ టీవి వచ్చిందని ఇద్దరం చెరో కుర్చీలో కూర్చుని టీవీకి అతుక్కుపోవడం ఏం బాగోటం లేదు. కనీసం ఒక మాట మాట్లాడటానికి కూడా లేదు. ఆఖరికి న్యూస్ పేపరు కాదు వారపత్రికలో సీరియల్ కూడా చదవలేక పోతున్నాను."

" అవునే మన బుజ్జిగాడికి కూడా మార్కులు పెరిగాయి కదూ !" గుర్తు చేశాడు.

" నిజమే అన్నట్లు నాకు కళ్ళు నెప్పులు కూడా తగ్గాయి. అంతే కాదండోయ్ ! కూర్చుని టీవి చూట్టం వలన నాకు వచ్చిన మెడ నెప్పులు - నడుము నెప్పులు ఈ మధ్య తగ్గాయి" కాత్యాయని చెప్పింది.

" గుడ్ ! నీ ఆరోగ్యం మెరుగయింది. నా సంగతీ అంతే ! స్లిమ్‌గా తయారయ్యానట! పెరిగిన బొజ్జ కరిగిందట ! ఈ మెకానిక్ చుట్టూ తిరిగి తిరిగి రెండు కిలోలు తగ్గాను. సాయంత్రాలు నడవడం మూలాన" సుబ్బారావు చెప్పాడు.

" ఏమండీ మనకి టీవీ వద్దండి" కాత్యాయని చెప్పింది.

" పిచ్చిమొహమా ఇంట్లో ఎలుకలున్నాయని ఇల్లు తగులబెట్టంగా - టీవి స్టేటస్ సింబలే! అడుక్కుతినేవాడికి కూడా ఠీవిగా టీవీ వుంది. ఓ పని చేద్దాం... కేబుల్ కనెక్షన్ తీయించి పారేద్దాం!" అప్పుడప్పుడు సుబ్బారావు బుర్రకూడా పనిచేస్తుంది.


" అరే ! మీరు కూడా ఆలోచించటం మొదలు పెట్టారే! నిజమే ! కేబుల్ లేకపోతే టీవి లేనట్టే గదా ! ఏ కార్యక్రమం చూడలేం కాబట్టి - వెంటనే టీవీని కట్టేస్తాం ఒక్క వార్తలు చూసి!" కాత్యాయని చెప్పింది సంబరంగా. " యాంకర్ల వెర్రినవ్వులు, వెధవ జోకులు వినక్కరలేదు."


" కాలం మనసొంతం" సుబ్బారావు ఆనందంగా చెప్పాడు.

– ప్రియదత్త వారపత్రిక 3-7-2002


బహుమతులు ఇచ్చిన వాళ్ళ పేర్లు చదువుతా!
వాళ్ళకే స్వీటు వెయ్యి సర్వర్ సుబ్రావ్!!
AVM


ఈ రోజు నన్ను బాగా తిట్టు! రేపు నిన్ను
నేను తిడతా! మీడియాలో
మనకి పిచ్చగా పబ్లిసిటీ!!
AVM


ఈ డాక్టర్ల సంబంధాలు చూడవద్దు!
ఈ వూళ్ళో వున్న డాక్టర్లందరూ...
నాకు ఎబార్షన్ చేసిన వాళ్ళే!!
AVM


ప్రతిసారీ! నిరాహార దీక్ష చేసి, చనిపోయేది! ఈ సుబ్బారావే!
AVM


డైరెక్టర్ వస్తున్నారు! మనం భార్యా భర్తలం అన్న విషయం తెలీనీకండి! లేకపోతే! హీరోయిన్‌గా తీసుకోడు!
AVM

